క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సతీష్ కుమార్ రెడ్డి మృతదేహం

చంద్రగిరి : చంద్రగిరిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన సతీష్‌కుమార్ రెడ్డి(38) తన బంధువులను బస్సు ఎక్కించి ఇంటికి తిరిగి వస్తుండగా విద్యానికేతన్ సంస్థకు చెందిన విద్యార్థులు బైక్‌పై వస్తూ ఢీకొట్టారు. దీంతో సతీష్‌కుమార్‌రెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. 108లో క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

క్రమశిక్షణకు మారుపేరు నరసింహులు


నరసింహులును సన్మానిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ)నరసింహులు క్రమశిక్షణకు మారుపేరుగా ఆర్టీసీ అధికారులు కొనియాడారు. డీపీటీఓ చాంబర్‌లో బుధవారం ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆయనను ఆర్టీసీ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీటీఎం విశ్వనాథంతో పాటు పలువురు డీఎంలు మాట్లాడుతూ ఉదయం 10 గంటల సమావేశం ఉందంటే పది నిమిషాలు ముందే డీపీటీఓ ఉంటారన్నారు. ఉద్యోగ విరమణ పొందే చివరి గంట వరకు ఆయన ఆర్టీసీకి ఏదో చేయాలని తపన ఉండేదని వెల్లడించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా ఉన్న విద్యార్థుల బస్‌పాస్ కేంద్రాన్ని తమ సొంత నిధులతో సౌకర్యవంతంగా మార్పు చేశారన్నారు. కార్యక్రమంలో పీఓ షహజాద్, అకౌంట్లు ఆఫీసర్ చంద్రమణి, డీఎంలు బాలాజీ, భాస్కరయ్య, డీఆర్ నాయుడు, మునిచంద్ర, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గానామృతం


గాత్ర కచేరీ చేస్తున్న రాజేష్‌కుమార్

తిరుపతి కల్చరల్: రామానుజచార్యుల అవతార మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అన్నమాచార్య కళామందిరంలో చిత్తూరుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు రాజేష్‌కుమార్ ఆలపించిన భక్తి సంకీర్తన గానం భక్తులకు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన పలు సంకీర్తనలు, కృతులను సుమధురంగా ఆలపించారు. రాగ, భావయుక్తంగా భక్తిభావంతో ఆయన శ్రీవారికి స్వర నీరాజనం చేశారు. వీరికి కీబోర్డుపై భరద్వాజ్, తబలాపై గోపి, శృతిపై వెంకటేష్ చక్కటి సహకారం అందించారు.

శ్రామికులారా వందనం..


చెత్తను తొలగిస్తున్న కార్మికుడు


భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు


తిరుపతి: చెత్త సేకరణలో శ్రమజీవుల కష్టం

తిరుపతి నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు పరిస్థితి దయనీయంగా మారింది. ఇంటింటికీ వెళ్లి చెతను సేకరించి డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. నాలుగు చక్రాలు ఉండాల్సిన చెత్త సేకరణ బండ్లకు మూడు చక్రాలే ఉండడంతో వాటిని నెట్టడానికి ఆపసోపాలు పడుతున్నారు. మరోవైపు చెత్తను సేకరించే వారి చేతులకు గ్లౌజులు లేకపోవడంతో చేతులతోనే సేకరిస్తున్నారు. నగరంలో కార్మికుల కష్టాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. -సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఘనంగా ఎస్వీ చిల్డ్రన్స్ స్కూల్ వార్షికోత్సవం


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

తిరుపతి కల్చరల్: శ్రీవేంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ 48వ వార్షికోత్సవం మహతి ఆడిటోరియంలో బుధవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారుల కోసం ప్రత్యేకంగా కాన్వొకేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల చైర్మన్ కేఎస్ వాసు మాట్లాడుతూ చదువుతో పాటు బహుముఖ ప్రతిభ చాటే విధంగా పిల్లలను మన సంస్కృతి, సంప్రదాయాలు, సృజనాత్మకత మేళవించి ఒత్తిడి రహిత వాతావరణంలో పాఠశాలకు వచ్చే విధంగా చేయగలగడమే తమ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వప్నలత, ప్రైమరీ ఇన్‌చార్జ్ బి.కవితశ్రీ, కిండర్ గార్డెన్ ఇన్‌చార్జ్ భువనేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి..

తిరుపతి క్రైమ్: నగరంలో నివాసం ఉంటున్న ఎంసీఏ విద్యార్థి ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్‌లో మోసపోయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సీతమ్మ నగర్‌కు చెందిన వర్షిణి ఎంసీఏ చదువుకుని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి కాల్ చేసి ఉద్యోగం ఇస్తానని నమ్మించి రూ.1.29 లక్షలు నగదు వేయించుకున్నాడు. తరువాత సమాధానం చెప్పకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న విద్యార్థిని వర్షిణి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఓ సరెండర్

కోట : ఉపాధిహామీ పథకం ఏపీఓ పూర్ణిమను డ్వామా పీడీకి సరెండర్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విధులకు గైర్హాజరు కావడం వల్లే మంగళవారం ఆమెపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. దీనిపై పీడీ శ్రీనివాసప్రసాద్‌ను వివరణ కోరగా కార్యాలయంలో ఉద్యోగుల మధ్య మనస్పర్థల కారణంగా ఇలాంటివి జరుగుతుంటాయని, త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని మాట దాటవేయడం గమనార్హం.

బ్యాంకు మేనేజర్‌పై దాడి

చంద్రగిరి:అధికార పార్టీకి చెందిన వ్యక్తులు పూటుగా మద్యం సేవించి వీరంగం సృష్టించారు. ఆపై బ్యాంకులోకి దూసుకెళ్లి మేనేజర్‌ను చితకబాదిన ఘటన బుధవారం చంద్రగిరి పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణానికి అనుకుని ఉన్న ఓ బ్యాంకులో మేనేజర్‌పై అరుణా కాలనీకు చెందిన కొంత మంది యువకులు సిబ్బంది, ఖాతా దారులు చూస్తుండగానే దాడికి తెగబడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నా, వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఏం చేయలేకపోయారు. ఈ క్రమంలో మందుబాబులు రోడ్డుపై బైఠాయించి నానా హంగామా చేసినట్లుగా స్థానికులు తెలిపారు. ఈ విషయంలో సదరు పార్టీ నేతలు రంగంలోకి దిగి మేనేజర్ కేసు పెట్టకుండా ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నగలు, నగదు కోసమే హత్య


రివార్డు అందిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో ఈనెల 10వ తేదీ జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించినట్లు డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. బుధవారం అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... జీవకోన పరిధిలోని రాఘవేందర్ నగర్‌లో శాంతమ్మ(64) అనే మహిళ నివసిస్తోంది. వడ్డీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అనంతపురం కదిరి నల్లగొండకు చెందిన జగదీష్ ఆయన భార్య హర్షిత మార్చిలో శాంతమ్మ ఇంట్లో అద్దెకు దిగారు. ఆమె వద్ద నగలు, నగదును గమనించి మంచిగా ఉంటూ దగ్గరయ్యారు. పథకం ప్రకారం శాంతమ్మను హతమార్చి వాటిని అపహరించాలని కుట్రపన్నారు. ఈ క్రమంలో జగదీష్, హర్షిత తమ మిత్రులైన ఓ మైనర్ బాలుడు, జమ్మలమడుగు శశిరేఖ, గుంటూరు మురళితో కలిసి పథకం పన్నారు. రాత్రి 10గంటల సమయంలో శాంతమ్మ ఇంటికి వెళ్లి చున్నీతో గొంతు నిలిమి హతమార్చారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ఆమె చీరతోనే ఫ్యాన్‌కు ఉరివేశారు. శాంతమ్మ వద్ద ఉన్న 129 గ్రాముల బంగారం, రూ.3.5లక్షల నగదును దోచుకున్నారు. 11వ తేదీన శ్రీకాళహస్తి కి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి ఏం తెలియనట్టు ప్రవర్తించారు. చివరకు పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో వాస్తవాలు వెలుగుచూశాయి. నిందితుల నుంచి నగలు, నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. మొత్తం సొత్తు విలువ సుమారు రూ.35లక్షలు ఉంటుందని వివరించారు.

నిందితులకు ముందే నేర చరిత్ర

ఈ కేసులో ప్రధాన నిందితుడు జగదీష్ గతంలో కదిరి నల్లగొండలో స్నేహితుడిని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నారన్నారు. అలాగే అతడిపై కిడ్నాప్, బందిపోటు కేసులు కూడా ఉన్నాయి. మరో నిందితురాలు హర్షిత తండ్రి ఉయ్యాల వెంకటరమణపై చిత్తూరు జిల్లా పరిధిలో సుమారు 17కు పైగా ఎర్రచందనం కేసులు నమోదయ్యాయని పోలీసులు వెల్లడించారు. కేసును ఛేదించిన సీఐ రామకిషోర్, ఎస్‌ఐలు లోకేష్, నాగార్జున రెడ్డి, సిబ్బంది రవి రెడ్డి, చంద్రశేఖర్, స్వయం ప్రకాష్, మురుగా రెడ్డిని డీఎస్పీ అభినందించారు. రివార్డును బహూకరించారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

నాయుడుపేటటౌన్:పట్టణంలోని ఆశోక్ నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. రైల్వే పరిధిలో ఉండడంతో గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై లైట్ బ్లూ కలర్ షాట్, తెలుపు బ్లూ కలర్ చారలు టీషర్టు ఉంది.

'నీట్'కు పటిష్ట ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ నరసింహులు

తిరుపతి అర్బన్:నీట్ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్‌ఓ నరసింహులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేంద్రీయ విద్యా లయ ప్రిన్సిపల్, నీట్ సిటీ కో–ఆర్డినేటర్ హేమంత్ పాండ్య, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారితో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ నీట్–2025ను ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం పది సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో 9 సెంటర్లు, గూడూరులో ఒక సెంటర్ ఉంటుందని చెప్పారు. మొత్తం 4,489 మంది విద్యార్థులు నీట్‌కు హాజరుకానున్నట్లు వివరించారు. ఆఫ్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షకు ఉదయం 11 గంటల నుంచి కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. ఆయా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన ప్రశ్నపత్రాలను సూపరింటెండెంట్లు, పోలీసు సహకారంతో తీసుకురావాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్లు, సహాయకులను ఏర్పాటు చేయాలన్నారు. నీట్ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోని అనుమతించమని తెలిపారు.

గంగమ్మ గుడి హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి హుండీ ఆదాయం రూ.13,50,612 లభించింది. బుధవారం ఆలయంలో హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఫణిరాజశయన పర్యవేక్షణలో లెక్కించారు.43 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకల రూపేణా ఈ ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ జయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ పోలీసులు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, సేవా కుటుంబ స్వచ్ఛంద సంస్థ సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదుకోవాలి.. అండగా నిలవాలి!


రుయాలో మృతుల బంధువులతో కలసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి తుడా : పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చి కూలి పనులు చేసుకొనే ఆ కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది . ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో వారికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఓరి భగవంతుడా నిన్ను నమ్మి ఎక్కడి నుంచో తిరుపతికి వచ్చి పొట్ట పోసుకుంటుంటే కనికరం లేకుండా మా జీవితాలు నాశనం చేశామా అంటూ మహిళలు బోరున విలపించారు. నా భర్తను తీసుకెళ్లావు నేను ఎలా బతకాలి స్వామి అంటూ మృతుడి శ్రీనివాసులు భార్య నారాయణమ్మ కన్నీరుమున్నీరైంది.

ఆందోళన

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడ్డ మా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నేతలతో కలిసి మృతుల బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతి రుయా మార్చురీ వద్ద బుధవారం మధ్యాహ్నం నిరసన చేపట్టారు. పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కార్మిక శాఖ కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించాలి



మా నా బిడ్డ వసంత్ మాకు దూరమయ్యాడు. ఇక మేము ఎలా బతకాలి. మాకు దిక్కెవరు. ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించాలి. అందరిలాగే కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలి. మా పరిస్థితులను గుర్తించి మాకు అండగా నిలబడాలి.

– బ్రహ్మయ్య, మృతుడు వసంత్ తండ్రి

ఎట్లా బతకాలి



తిరుపతిలో పనులు చేసుకుని బతకవచ్చనే ఉద్దేశంతో మేము ఒంగోలు నుంచి వచ్చాం. ఊరు గాని ఊర్లో మాకు తీరని దుఃఖమే మిగిలింది. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలి. లేకుంటే మేం ఎట్లా బతకాలి.

– నారాయణమ్మ, మృతుడు శ్రీనివాసులు భార్య

క్షతగాత్రులకు కొనసాగుతున్న వైద్యం

తిరుపతి తుడా: చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండల పరిధిలో సోమవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు క్షతగాత్రులకు స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. క్రిస్విన్ వెంటిలేటర్పై చికిత్స పొందుతోంది. అలాగే మరో క్షతగాత్రురాలు గీతమ్మ ఆరోగ్యం కుదుట పడుతోందని వైద్యులు తెలిపారు.

లోయలోకి దూసుకెళ్లిన వాహనం



తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం రాత్రి ఓ కారు లోయలోకి దూసుకెళ్లింది. తిరుమల నుంచి తిరుపతికి నలుగురు ప్రయాణికులతో వస్తున్న కారు వేగంగా వస్తూ అదుపు తప్పి ఘాట్ రోడ్డులోని 46 మలుపు వద్ద పిట్ట గోడను ఢీకొంది. దీంతో చిన్నప్పటి లోయ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు భక్తులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన తిరుపతికి రుయా ఆసుపత్రికి తరలించారు.

ఐడియాథాన్ ఆవిష్కరణల ప్రదర్శన


ప్రతిభ చాటిన విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఐడియాథాన్–2025పేరుతో 'స్థిరమైన పర్యావరణానికి నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై బుధవారం జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రొఫెసర్ హెచ్‌ఎస్ చాణక్య (బెంగళూరు) ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకోసం స్థిరమైన వనరుల వినియోగంపై ఆయన ప్రసంగించారు. అనంతరం ప్రదర్శన పోటీలలో ప్రతిభ చాటి తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల బృందాలకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.3వేలు నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, డాక్టర్ రవిశంకర్ (తిరుపతి ఐఐటీ), ఐజర్ నుంచి డాక్టర్ అంబరీష్ సక్సేనా, ప్రొఫెసర్ కాత్యాయిని, ప్రొఫెసర్ విద్యావతి, డాక్టర్ జే.సూర్యకుమార్, పర్యావరణ కార్యకర్త పి శివాజీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నేటి నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన గ్రామీణ, మండల, జిల్లా కేంద్రాల్లో మొత్తం 50 శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్ర వేళల్లో పిల్లలకు వివిధ క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. బుధవారం ఈ మేరకు డీఎస్‌డీఓ సయ్యద్‌సాహెబ్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తిగల క్రీడల్లో రాణించేందుకు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు తమ ప్రాంతాల్లోని పిల్లలకు అవగాహన కలిగించి శిక్షణ శిబిరాలకు హాజరయ్యేలా సహకారం అందించాలని సూచించారు.

క్రీడ	స్థలం
ఆర్చరీ	ఓల్డ్ ఏజీ కళాశాల, కేటీ రోడ్డు, తిరుపతి కేవీకే స్టేడియం, శ్రీకాళహస్తి
అథ్లెటిక్స్	ఎస్వీయూ స్టేడియం, తిరుపతి జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ
బాక్సింగ్	జెడ్పీహెచ్‌ఎస్, తిరుచానూరు కేవీఎస్–స్పోర్ట్స్ కాంప్లెక్స్, తుమ్మలగుంట శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
బాల్ బ్యాడ్మింటన్	జెడ్పీహెచ్‌ఎస్(బాలురు), శ్రీకాళహస్తి
బాస్కెట్‌బాల్	ఏవీకేఆర్ జెడ్పీహెచ్‌ఎస్, కోట మండలం జెడ్పీహెచ్‌ఎస్ కొత్తపాళెం, కోట మండలం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
చెస్	చెస్ కిడ్స్ అకాడమీ, బైరాగిపట్టెడ, తిరుపతి, కిడ్జ్ చెస్ అకాడమీ, తిరుచానూరు
క్రికెట్	ఎస్ఆర్‌ఎస్ ప్రభుత్వ హైస్కూల్, పుత్తూరు
ఫెన్సింగ్	శ్రీదేవి కాంప్లెక్స్, తిరుపతి
ఫుట్‌బాల్	రైల్వే గ్రౌండ్, నాయుడుపేట జెడ్పీహెచ్‌ఎస్, ఎ.రంగంపేట, చంద్రగిరి మండలం కేవీఎస్, తుమ్మలగుంట, తిరుపతి ఎస్ఆర్‌ఎస్ ప్రభుత్వ హైస్కూల్, పుత్తూరు రైల్వేగ్రౌండ్, రేణిగుంట
హాకీ	ఆర్‌సీఆర్ ఎంబీఏ కళాశాల గ్రౌండ్, కరకంబాడి సీఆర్‌సీ గ్రౌండ్, వెంకటాపురం, రేణిగుంట మండలం జెడ్పీహెచ్‌ఎస్, విందూర్, గూడురు మండలం
హ్యాండ్ బాల్	పోగలకుప్పయ్య గ్రౌండ్, చింతకాల్వ వడమాలపేట మండలం ఏవీకేఆర్‌ఎస్, జెడ్పీహెచ్, కోట మండలం
జూడో	జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు, రేణిగుంట మండలం జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు, మంగళం ట్రెండ్స్
ఖోఖో	జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ మండలం
కబడ్డీ	జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ మండలం ఓల్డ్ జూనియర్ కళాశాల గ్రౌండ్, నాగలాపురం
కరాటే	జెన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, తిరుపతి జీవకోన, సత్యనారాయణపురం, తిరుపతి శ్రీ ఎన్ఆర్‌ఐ ఇం. మీడియం స్కూల్, తిరుపతి
రైఫిల్ షూటింగ్	ఎస్ఎస్ఎస్‌సీ షూటింగ్ రేంజ్, తిరుపతి
స్కేటింగ్	అంగన్‌వాడి స్కూల్ గేట్ సమీపం, పుత్తూరు
తైక్వాండో	రాక్ ఫైటర్స్ క్లబ్, ఎంఆర్ పల్లి, తిరుపతి ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్, పుత్తూరు శ్రీగోవిందరాజులు హైస్కూల్, తిరుపతి ఎన్‌జీఓ హోమ్, ఎల్ఐసీ బిల్డింగ్, తిరుపతి
వాలీబాల్	జెడ్పీహెచ్‌ఎస్, తడ ఎస్వీ నగర్, చంద్రగిరి మండలం నరసింగాపురం, చంద్రగిరి మండలం ఏవీకేఆర్ జెడ్పీహెచ్‌ఎస్, కోట మండలం ఎస్వీయూ క్యాంపస్ స్కూల్, తిరుపతి
రెజ్లింగ్	జెడ్పీహెచ్‌ఎస్, నాయుడుపేట జెడ్పీహెచ్‌ఎస్, రాననూరు, పెళ్లకూరు మండలం ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్, సూళ్లూరుపేట
యోగా	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
డీఎస్‌ఏ ఆధ్వర్యంలో..	
హాకీ	ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి
ఫుట్‌బాల్	ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి
టెన్నిస్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
బ్యాడ్మింటన్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
స్విమ్మింగ్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
కుస్తీ	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
స్కేటింగ్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
కుస్తీ	జెడ్పీహెచ్‌ఎస్, తిరుచానూరు
వాలీబాల్	ఎస్పీజేఎన్ఎం స్కూల్, తిరుపతి
హాకీ	బాలుర ప్రభుత్వ హైస్కూల్, చంద్రగిరి
హాకీ	అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియం, గూడూరు
బ్యాడ్మింటన్	కేవీకే, శ్రీకాళహస్తి

అంతర్రాష్ట్ర మోసగాడి అరెస్ట్

• 132 గ్రాముల బంగారం స్వాధీనం


నిందితుడు మురుగన్

తిరుమల: తిరుమలలో మాంగల్య పూజల పేరిట భక్తులను మోసం చేసే ఘరానా దొంగను వన్ టౌన్ పోలీస్ బుధవారం అరెస్ట్‌చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.13 లక్షల విలువైన 132 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం మదురైకి చెందిన మురుగన్ నాగరాజు అలియాస్ శంకరరావు మార్చి 29వ తేదీన తిరువణ్ణామలై ప్రాంతానికి చెందిన ఉచిమహాలి అనే మహిళను తిరుమలలో పరిచయం చేసుకున్నాడు. మాంగల్య పూజ చేస్తే భర్తకు, కుటుంబానికి మేలు జరుగుతుందంటూ నమ్మబలికాడు. ఆమెను మినీ షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు తీసుకెళ్లి రెండు డజన్ల మట్టి గాజులు ఇచ్చాడు. అనంతరం ఆమె నుంచి 40 గ్రాముల బంగారు మాంగల్య సూత్రం, లక్ష్మీ డాలర్ చైన్, రెండు సెల్‌ఫోన్లు తీసుకున్నాడు. పుష్కరిణికి వెళ్లి స్నానం చేసి ఆలయం ముందుకు మాంగల్య పూజకు రమ్మని చెప్పి పరారయ్యాడు. మార్చి 14వ తేదీన కోయంబత్తూరు ప్రాంతానికి చెందిన శరణ్య అనే మహిళా భక్తురాలిని మోసం చేసి ఆమె వద్ద నుంచి 80 గ్రాముల బంగారు అపహరించుకుని వెళ్లిపోయాడు. అదేవిధంగా అదే నెల 18న తిరువళ్లూరు జిల్లాకు చెందిన లక్ష్మి అనే మహిళకు మాయ మాటలు చెప్పి 12 గ్రాముల బంగారు గొలుసును తీసుకుని మాయం అయ్యాడు. ఈ మూడు ఘటనలపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఎస్‌ఐలు రమేష్ బాబు, చలపతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ముమ్మురంగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో మదురైకి చెందిన మురుగన్ నాగరాజు ఈ మోసాలకు పాల్పడినట్టు గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిపై ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల్లో సుమారు 20కి పైగా కేసులు ఉన్నట్లు విచారణలో తెలిసింది.

పెండింగ్ కేసులకు ప్రాధాన్యం


సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

వడమాలపేట (విజయపురం) : పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బుధవారం విజయపురం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది డ్యూటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. నోటీస్ బోర్డులో నూతన చట్టాలను రాసి ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను కోర్టు అనుమతి తీసుకుని డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ సాధిక్ ఆలీ, ఎస్‌ఐ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

దళిత వాడల్లో 'పల్లె నిద్ర'

సత్యవేడు : గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో పోలీసులు పల్లె నిద్ర చేపట్టాలని, చట్టాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. ఆదివారం రాత్రి సత్యవేడు సీఐ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తో కలసి ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రహదారుల్లో స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

డాక్టర్ చంద్రశేఖరన్‌కు ఘన వీడ్కోలు



డాక్టర్ చంద్రశేఖరన్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారులు, అధ్యాపకులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ పీఏ చంద్రశేఖరన్‌కు రుయా, వైద్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం వైద్య కళాశాలలో డాక్టర్ చంద్రశేఖరన్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు మాట్లాడుతూ వైద్య విద్యలో చంద్రశేఖరన్ చేసిన కృషి, సాధించిన ఫలితాలు నేడు మనం అనుభవిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెకానిక్‌కు చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: ప్రమాదవశాత్తు కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టూవీలర్ మెకానిక్ జాకీర్ కుటుంబానికి తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించి చేయూతనిచ్చారు. ఐఎస్ మహల్ సమీపంలో మెకానిక్‌గా పని చేస్తున్న జాకీర్‌కు కాలు విరిగి ఆస్పత్రి పాలయ్యాడు. విషయం తెలిసి అసోసియేషన్ నేతలు జాకీర్‌ను పరామర్శించి సాయం అందించారు.

అక్రమ కట్టడాలకు అడ్డేవరు?



భవనాల వద్ద నాసిరకంగా ఏర్పాటు చేసిన సపోర్టు కర్రలు

ఆధ్యాత్మిక తిరుపతి నగరంతో పాటు నగర శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలో టౌన్ ప్లానింగ్‌పై, పంచాయతీల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో క్షేత్రస్థాయిలో భవన నిర్మాణాల పరిశీలన గాలికొదిలేశారు. కేవలం ప్లానింగ్ సెక్రటరీలపైనే ఆధార పడడంతో అక్రమ కట్టడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

- తిరుపతి నగరంతో పాటు రూరల్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు
- తిరుమలనగర్‌లో భవన నిర్మాణం ఆపాలని ఇప్పటికే నోటీసులు
- పంచాయతీ అధికారుల మాటను లెక్క చేయని భవన యజమానులు
- అయినా పనులు ప్రారంభించిన యజమాని
- పొట్ట కూటి కోసం వచ్చిన ముగ్గురు కార్మికులు మృతి
- పంచాయతీ, తుడా అధికారుల మధ్య లోపించిన సమన్వయం

తిరుపతి తుడా/తిరుపతి మంగళం: భవన నిర్మాణాలలో నిబంధనలను అమలు చేయడంలో మున్సిపల్ కార్పొరేషన్, కార్మిక శాఖ, పంచాయతీల అధికారులు కానీ సరైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. కార్మికుల భద్రతపై కార్మిక శాఖ కునుకు వహిస్తోంది. భవన నిర్మాణంలో కానీ, పాత భవనాల తొలగింపులో గానీ ఎక్కడ భద్రతా చర్యలు పాటించడం లేదు. కార్మికుల భద్రత విషయంలో, కార్మికులను గుర్తించి వారికి ప్రమాద బీమా కట్టించడం, గుర్తింపు కార్డులు జారీ చేయడం, భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టడంలో కార్మిక శాఖ పూర్తిగా విఫలమైంది. తాజాగా భవన నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడంతో మంగళవారం రోజున మంగళం సమీపంలో భవనం పైనుంచి పడి ముగ్గురు కూలీలు మృత్యువాత పడ్డారు.

లోపించిన సమన్వయం..

నగరం లేదా పంచాయతీలో 300 చదరపు గజాలకు లోపు ఇంటి స్థలం ఉంటే పంచాయతీ నుంచి, ఆ పైన ఉంటే తుడా నుంచి ఇంటి నిర్మాణం కోసం అనుమతులు తీసుకోవాలి. పంచాయతీ పరిధిలో జీప్లస్ 2 ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే అనుమతులు ఇస్తారు. తుడా అధికారులు కూడా పంచాయతీల పరిధిలో జీప్లస్ 3 భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇస్తుంటారు. అయితే భవన నిర్మాణాలు చేపడుతున్న యజమానులు తీసుకున్న అనుమతులను అతిక్రమించి జీప్లస్ 4, జీప్లస్ 5, జీప్లస్ 6 అంతస్తులను నిర్మిస్తున్నారు. పంచాయతీల అధికారులు అభ్యంతరాలు చెబుతున్నా ఏమాత్రం లెక్క చేయడం లేదు. ఎలాగో నిర్మించుకున్నాం గనుక బీపీఎస్ కింద రెగ్యులరైజేషన్ చేసుకుంటామని చెబుతూ అఫిడవిట్లు సమర్పిస్తున్నారు. అయితే బీపీఎస్ పద్ధతి కొనసాగడం లేదని, అనుమతులకు మించి అంతస్తులు నిర్మించరాదని అధికారులు అభ్యంతరాలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

పంచాయతీలను విభజించడంతో..

పంచాయతీల విభజన నేపథ్యంలో 2022లో శెట్టిపల్లి ఉమ్మడి పంచాయతీ నుంచి కొత్తగా ఐదు పంచాయతీలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి ఆయా పంచాయతీల్లో అనుమతులకు మించి నిర్మిస్తున్న భవనాలకు పంచాయతీల కార్యదర్శులు నోటీసులు ఇస్తున్నారు. అయినా భవన నిర్మాణదారులు నిబంధనలు పాటించకుండా, నోటీసులను పట్టించుకోకుండా కట్టేస్తున్నారు. తిరుమల నగర్ పంచాయతీలోని తుడా క్వార్టర్స్‌లో అనుమతులకు మించి నిర్మిస్తున్న 15 భవనాలకు కూడా పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందుకున్న వారు రాజకీయ పలుకుబడితోనే.. అధికారికంగా పంచాయతీ అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. ముగ్గురి ప్రాణాలను బలి తీసుకున్న భవనం నిర్మాణ పనులను కూడా ఆపాలని పంచాయతీ అధికారులు గతంలోనే అభ్యంతరాలు చెప్పారు. తాజాగా ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందిన నేపథ్యంలో సప్తగిరి కాలనీ పంచాయతీ, న్యూమంగళం పంచాయతీ పరిధిలో 20 అక్రమ నిర్మాణాలకు నోటీసులు అందజేశారు. మూడు పంచాయతీల పరిధిలో 100కు పైగా అనుమతులు లేని భవనాలు నిర్మాణాలు జరుపుకుంటున్నాయని తెలిసింది. తుడా ఫేస్ 2 లేఅవుట్‌లో బుధవారం కూడా అనుమతులు లేని భవన నిర్మాణాలు కొనసాగడం గమనార్హం.

సహకరించని తుడా..

రిజిస్ట్రేషన్ భూముల్లో భవన నిర్మాణ అనుమతుల నేపథ్యంలో తుడా, పంచాయతీల మధ్య సమన్వయం లోపించింది. పంచాయతీ అధికారులు భవన నిర్మాణాలకు తాము ఇచ్చే అనుమతుల జాబితాను తుడాకు పంపిస్తూ ఉంటారు. అయితే తుడా అధికారులు మాత్రం వారు ఇచ్చే అనుమతి జాబితాలను పంచాయతీలకు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజా సంఘటన నేపథ్యంలో ఇదే అంశాన్ని పంచాయతీల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినట్టు సమాచారం. ఇకపై తుడా అధికారులు పంచాయతీల పరిధిలో భవన నిర్మాణాలకు ఇచ్చే అనుమతులను, వాటి వివరాలను పంచాయతీలకు పంపాలని ఆదేశించినట్టు తెలిసింది.



తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం



నగరంలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇలాంటి భవనాలెన్నో..!

అక్రమాలకు అండగా కూటమి నేతలు

టీడీపీ, జనసేన నేతలు క్షేత్రస్థాయిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా నగరంలో అక్రమంగా, ప్లాన్లకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను ఎంచుకుని వాటికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు రాజకీయ నేతల ఒత్తిడి ఉండడంతో అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారని తెలుస్తోంది. కొంతమంది చోటా నేతలు తమ వార్డుల్లోకి అధికారులు రాకుండా అడ్డుకుంటూ అక్రమాలను పెంచి పోషిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



రక్షించు తల్లీ..

గంగమ్మను దర్శించుకుంటున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మను టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ప్రజలను కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు.

గంగమ్మ జాతర చాటింపు



నడివీధి గంగమ్మ వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలో గంగమ్మ జాతర చాటింపు నిర్వహించారు. గ్రామపెద్దలు బుధవారం తెల్లవారుజామున నడివీధి గంగమ్మ వద్దకు చేరుకుని వేపాకులతో పాటు పసుపు, కుంకుమ తీసుకెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో జాతర చాటింపును నిర్వహించారు. మే 6వ తేదీన గ్రామంలో జాతరను నిర్వహించనున్నట్లు గ్రామస్తులకు తెలియపరిచేలా డప్పు కొట్టి చాటింపు వేయించారు.

ముగిసిన అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు



కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

చంద్రగిరి: అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా బుధవారం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. రెండు రోజుల పాటు శిల్పారామం సహకారంతో శ్రీకృష్ణ నటరాజాలయం వ్యవస్థాపకుడు కొండా రవి ఆధ్వర్యంలో దినోత్సవాలను నిర్వహించారు. ఇందులో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలను శిష్య బృందంతో కలసి ప్రదర్శించారు. 14 ఏళ్లలోపు చిన్నారులు చేసిన నాట్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

మైనారిటీలకు రాయితీ రుణాలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి సబ్సిడీ పథకాల బ్యాంకు రుణాల మంజూరుకు అర్హులైన మైనారిటీలు, క్రిస్టియన్ మైనారిటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం కార్యనిర్వాహక సంచాలకులు హరినాథరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 625 యూనిట్లు జనాభా ప్రకారం ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. తెల్లరేషన్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ పరిధిలో నివాసం ఉన్నవారు, 21- 55 ఏళ్ల లోపు, తహసీల్దార్ నుంచి పొందిన మైనారిటీ సర్టిఫికెట్ జెరాక్స్‌లు దరఖాస్తుకు జతచేయాలని చెప్పారు. ఈ నెల 25వరకు దరఖాస్తులకు గడువు ఉందని స్పష్టం చేశారు.

మైనారిటీ, క్రిస్టియన్లకు సబ్సిడీ రుణాలు

పాకాల: రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీలకు సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ అరుణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ మైనారిటీ సభ్యులు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగి, కులధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఘనంగా తిరునక్షత్రోత్సవాలు



మాట్లాడుతున్న వైఖానస ఆగమ పండితులు

తిరుమల: వైఖానస ఆచార్యులు శ్రీ భృగు మహర్షి, శ్రీనివాస మఖి తిరునక్షత్రోత్సవాలు బుధవారం సాయంత్రం తిరుమలలో ఘనంగా జరిగాయి. తిరుమలలోని ఆస్థాన మండపంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, వైఖానస దివ్య సిద్ధాంత వర్ధినీ సభ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఖానస ఆగమ పండితులు ప్రభాకరాచార్యులు, వైఖానస దివ్య సిద్ధాంత వర్ధనీ సభ అధ్యక్షుడు రాఘవ దీక్షితులు, కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు పాల్గొని భృగు మహర్షి, శ్రీనివాస మఖి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

పాకాల: ఏనుగుల దాడులతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించాలని గ్రామీణ పేదల సంఘం కన్వీనర్ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గానుగపెంట పంచాయతీలోని పలు గ్రామాల్లో ఏనుగులు పంట పొలాలపై వరుసగా దాడులు చేస్తూనే ఉన్నాయని తెలిపారు. ధనూజవారిపల్లికి చెందిన శ్రీనినివాసులు, చిన్న పాపయ్యగారిపల్లికి చెందిన పి.శివయ్య, సోమశేఖర్, టి.గురుదేవ, బాలగురుస్వామి, మంగమ్మ, మోహన్, గానుగపెంటకు చెందిన గుడి రమేష్‌కు చెందిన పొలాల్లోని వరి, మామిడి, చెరుకు, అరటి, కొబ్బరి, బొప్పాయి తోటలను ఏనుగుల గుంపు నాశనం చేశాయన్నారు. పొలాల చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను కూడా ధ్వంసం చేశాయని ఆవేదన చెందారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం స్పందించి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదల సంఘం కార్యదర్శి భాస్కర్, సభ్యులు పాల్గొన్నారు.

పుష్పయాగానికి అంకురార్పణ రేపు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఈనెల 3వ తేదీన జరుగనున్న పుష్పయాగం సందర్భంగా శుక్రవారం సాయంత్రం అంకురార్పణ జరుగనుంది. 3వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పుష్పాలతో అభిషేకం చేస్తారు. అనంతరం రాత్రి 7 గంటలకు స్వామివారు మాడవీధుల్లో భక్తులను అనుగ్రహించనున్నారు. గృహస్తులు ఇద్దరు రూ.1000 చెల్లించి టిక్కెట్ కొనుగోలు చేసి పాల్గొనవచ్చు.